ప్రజాశక్తి

గురువారం 5 జనవరి 2023 5

పార్వతీపురం మన్యం

అపారిశుధ్యంపై సబ్‌కలెక్టర్ ఆగ్రహం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో అపారిశుధ్యంపై 'మరీ ఇంత దారుణమా' అనే కథనం ప్రజాశక్తిలో బుధవారం ప్రచురితం కావడంతో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తీవ్రంగా స్పందించారు. స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుతో మాట్లాడారు. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. శానిటేషన్ కార్యదర్శులకు ఛార్జిమెమో జారీ చేస్తామని కమిషనర్ తెలిపారు. అదే విధంగా అక్కడ పారిశుధ్య పనులు కూడా చేపట్టారు.

శుభ్రం చేసిన కాలువ

ధాన్యం కొనుగోలులో దళారులదే పైచేయిగా నిలుస్తోంది. ప్రభుత్వం నూతన సాంకేతిక విధానం అమల్లోకి తెచ్చామని, ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామంటూ చేసిన ప్రకటనలు ఆచరణలో నీటి మీద రాతలుగా మిగిలాయి. అన్నదాత ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు ప్రతి ఏడాదిలానే ఈ ఏటా ఇబ్బందులు తప్పలేదు. రైతు భరోసా కేంద్రాల్లో నెలకొన్న సాంకేతిక సమస్యలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. హమాలీలు, లారీల కొరత వంటి బాధలు పడలేక అత్యధిక మంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మే బదులు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా క్వింటాకు రూ.500 నుంచి రూ.600 వరకు ధర తగ్గించి దళారులు కొనుగోలు చేస్తూ రైతులను నిలువునా దోచేస్తున్నారు.

కురుపాం.. లారీలు పంపించకపోవడంతో కళ్లాల్లో నెట్లు వేసి ఉంచిన ధాన్యం బస్తాలు

ధాన్యం కొనుగోళ్లలో దళారులదే హవా

ధాన్యం తూనిక వేస్తున్న దళారులు

- లక్ష్య సాధనలో అధికార యంత్రాంగం విఫలం
- తప్పని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- రూ.500 వరకు నష్టపోతున్న అన్నదాతలు
- గోనె సంచుల సరఫరాలోనూ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో 8,027 వేల ఎకరాల్లో రైతులు ఈ ఏడాది వరి సాగుచేపట్టారు. 17 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. మండలంలో 9 రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం 12 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి ప్రణాళికల రూపొందించింది. ఇప్పటివరకు కేవలం 4000 మెట్రిక్ టన్నులు కొన్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అధికారుల గణాంకాల ప్రకారం మండలంలో 100 శాతం ధాన్యం కోతలు జరిగినట్లు అంచనా. సేకరణలో అత్యంత కీలకమైన గోనె సంచులు, రవాణా, ధాన్యం ఆరబెట్టుకునేందుకు సౌకర్యాలు కల్పించడంలోనూ చిత్తశుద్ధి కరువైంది. ఫలితంగా ధాన్యం సేకరణలో అధికారులు తలకిందులయ్యారు.

దళారులను ఆశ్రయిస్తున్న రైతులు

రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ గోనె సంచులు, ట్రక్కు షీట్లు అంటూ తిరిగి తిరిగి విసుగుచెందుతున్నారు. ఇంకోవైపు వాతావరణ మార్పులు వల్ల భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి తరుణంలో ధాన్యం తడిస్తే రంగు మారడం వల్ల అసలుకే ఎసరు వస్తుందనే భయంతో తప్పని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా దళారులు క్వింటాకు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.500 నుండి 600 తక్కువ ధరకు కొంటున్నారు. మరోవైపు క్వింటాకు అదనంగా నాలుగైదు కిలోలు ధాన్యం తూనిక వేస్తూ దళారులు దోచుకోవడం మొదలుపెట్టారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు ఎన్నడూ లేని విధంగా అష్టకష్టాలు పడుతూ నష్టానికి అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

లారీల కోసం ఎదురు చూస్తున్నాం

వారం రోజులుగా ధాన్యం తూకం చేసి కళ్లాల్లో నెట్టు వేసి లారీల రాక కోసం ఎదురుచూస్తున్నాం. అయినా లారీలు రాలేదు. ఇలాంటి తరుణంలో వాతావరణ మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. హమాలీల ఖర్చులు అన్నీ కూడా మేమే భరిస్తే ఆ ఖర్చులు తర్వాత ఖాతాలకు జమచేస్తామని అంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

- గౌడు తిరుపతి, రైతు, కురుపాం

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

రైతుల దగ్గర నుండి ధాన్యం కొనుగోలుపై అధికారులు 40.180 కిలోలు తూనిక వేయాలని చెబుతున్నారు. మరోవైపు 42 కేజీలు బస్తా ఉంటేనే మిల్లులో దించుతామని, లేదంటే ధాన్యాన్ని మిల్లు వద్ద దించబోమని మిల్లర్లు తెగేసి చెబుతున్నారు. రైతు దగ్గర డబ్బులు లేకపోవడంతో రవాణా, హమాలీల ఛార్జీలు ఇవ్వలేకపోతున్నారు. ప్రభుత్వం వెంటనే రవాణా ఛార్జీలు ఇప్పించి, పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలి. మిల్లర్ల దోపిడీపై చర్యలు తీసుకోవాలి.

- కొల్లి గంగునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి

గోనె సంచులకు పాట్లు

పాలకొండ : ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. రైతులు దగ్గర ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అయితే ఆది నుంచి రైతులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. ప్రతి విషయంలో కూడా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రవాణాతో పాటు కూలీల సమస్య జంబ్లింగ్ పద్ధతి వద్ద రైతులు నానా అవస్థలకు గురవుతున్నారు. మండలంలో 17 వేల ఎకరాల్లో వరిసాగైంది. కొనుగోలు కేంద్రాల ద్వారా గోనె సంచులు ప్రభుత్వమే సరఫరా చేస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం గోనె సంచులు అందించకపోవడంతో రైతులు బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తుంది. సుమారు రూ.20 వరకు చెల్లించి గోనెలు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఒక్కో గోనెకు రూ.3.50 పైసలు మాత్రమే అందిస్తుంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోను సంచులు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

అన్నీ ఇబ్బందులే....

ధాన్యం కొనుగోలు విషయంలో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం గోనె సంచులు ఇస్తామని, కూలీలను కూడా అందుబాటులో ఉంచు తామని, ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పిస్తామని చెప్పినా ఏఒక్కటీ అమలు చేయలేదు.. దీంతో బ్లాక్ మార్కెట్‌కే వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. దీనిని ఆసరాగా తీసుకుని వ్యాపారులు అధిక రేట్లకు గోనె సంచులను విక్రయిస్తున్నారు.

- పిట్ట రమణ, రైతు, కొండాపురం

నిర్లక్ష్యం వీడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

సీతానగరం.. కళ్లాల్లో ఉంచిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

సీతానగరం : ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అంటిపేట, లచ్చయ్యపేట, కాశీపేట, తదితర గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించింది. గ్రామాల్లో ధాన్యం నిల్వలను పరిశీలించి, రైతులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతులు నూర్పులు పూర్తిచేసి, కళ్లాల్లో ధాన్యం బస్తాలను సిద్ధం చేశారని తెలిపారు. ప్రభుత్వం లక్ష టన్నులు దాటి ధాన్యం కొనుగోలు చేసినట్లు ప్రకటిస్తున్నా, గ్రామాల్లో ఎక్కడికక్కడ ధాన్యం నిల్వలు కనిపిస్తున్నాయని తెలిపారు. తూనికల్లో మిల్లర్లు మోసాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 40 కిలోల బస్తాకు అదనంగా రెండు కేజీలు తీసుకుంటున్నారని చెప్పారు. మరోవైపు ధాన్యం రవాణాకు లారీలు పంపించడం లేదని, వచ్చిన లారీలు కూడా బ్యాంకు గ్యారంటీలు కట్టలేదనే పేరుతో కదలడం లేదని రైతులు చెబుతున్నారని తెలిపారు. ఇలాంటి తరుణంలో వాతావరణంలో మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వర్షం పడితే ధాన్యం తడిసి, రంగుమారే అవకాశం ఉందన్నారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి లారీలను పూర్తిస్థాయిలో జిల్లా మొత్తం పంపించి, ధాన్యం కొనుగోలు ముమ్మరం చేయాలని డిమాండ్‌చేశారు. ధాన్యం డబ్బులు వెంటనే రైతులు ఖాతాల్లో వేయాలని కోరారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి వెంకటరమణ, రెడ్డి శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పారిశ్రామిక అభివృద్ధితో ఉపాధి

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధితో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు, పారిశ్రామికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పరిశ్రమలను స్థాపించుట ద్వారా ఉపాధి అవకాశాలు పెంచాలని తెలిపారు. పారిశ్రామికవాడలకు కావలసిన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారితో ఎగుమతులకు అవకాశం లభిస్తుందన్నారు. పిఎంఇజిపి, ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులను లక్ష్యానికి మించి తీసుకోవాలని, అర్హత కలిగిన వాటిని బ్యాంకులకు పంపించాలని సూచించారు. పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా పారిశ్రామిక యూనిట్లు స్థాపించాలని, ప్రతి మండలానికి కనీసం 30 సంఘాల ద్వారా ఏర్పాటుకు ఎంపిక చేయాలని తెలిపారు.

జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారాం కమిటీ నివేదిక సమర్పించారు. సింగిల్ డెస్క్ పోర్టల్‌లో ఐదు దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని చెప్పారు. జిల్లాలో 12 మంది రైసుమిల్లర్లు సార్టెక్స్ మిషన్ల రుణం కోసం దరఖాస్తు చేశారని తెలిపారు. పిఎంఇజిపి ద్వారా 168 యూనిట్లు లక్ష్యం కాగా 45 యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పారిశ్రామిక పార్కులకు భూమి గుర్తింపులో భాగంగా సీతంపేట మండలం, పనుకువలసలో 30 ఎకరాలు, పాచిపెంట మండలంలో 2398 ఎకరాలు గుర్తించినట్లు వెల్లడించారు. పాచిపెంట మండలంలో 465 ఎకరాల స్థలం అనువుగా ఉందని ఎపిఐఐసి తెలియజేసిందని వివరించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 30 దరఖాస్తులు ఆమోదించినట్లు తెలిపారు. పార్వతీపురం మండలం నాగూరులో బియ్యం మిల్లులు, కురుపాం మండలం లేవిడి గ్రామంలో చింతపండు క్లస్టర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు.

ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా రవాణా అధికారి ఎం.శశికుమార్, జిల్లా ఉద్యాన అధికారి కె.వి.ఎస్.ఎన్ రెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి వేమూరి తిరుపతయ్య, లీడ్ బ్యాంకు అసోసియేట్ కె.మౌనిక, కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సుధాకరరావు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన కర్మ చంద్రబాబే

పింఛను వారోత్సవాల్లో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

40 ఏళ్ల అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు లాంటి ప్రతిపక్ష నేత రాష్ట్రంలో ఉండడం రాష్ట్ర ప్రజల కర్మని డిప్యూటీ సిఎం రాజన్నదొర వ్యాఖ్యానించారు. బుధవారం మండలంలోని బాగువలసలో నిర్వహించిన పింఛను వారోత్సవాలలో డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడారు. దేశ రాజకీయాల్లో తానే సీనియర్ నాయకుడినని చెప్పుకునే చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చితో 40మంది అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల గుంటూరు, కందుకూరులో టిడిపి బహిరంగ సభలకు జనాలను తీసుకొచ్చి తొక్కిసలాటలో 11మంది మరణించారని చెప్పారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడే జరిగిన పుష్కరాల్లో పాల్గొన్న చంద్రబాబు డ్రోన్‌షాట్ కోసం తొక్కిసలాటలో 29మంది చనిపోయారని చెప్పారు. చంద్రబాబు ప్రచార యావ కారణంగానే 40 మంది ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంలో గాని, జిల్లాలో గాని చేసిన అభివృద్ధి ఏదీ లేదని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో ఒక్క రహదారి గాని, వంతెన గాని నిర్మించలేదన్నారు. ఒకవేళ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని అనేక సార్లు సవాల్ చేసినా టిడిపి నాయకులు ముందుకు రాలేదన్నారు. టిడిపి నాయకుల మాయమాటలు నమ్మితే పేదలే నష్టపోతారని అన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా నీతివంతమైన పాలన సాగిస్తున్న రాజన్నదొరని మళ్ళీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపిలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, కె.త్రినాథనాయుడు, సువ్వాడ భరత్ శ్రీనివాస్, సర్పంచ్ రెడ్డి సుకన్య, ఎంపిడిఒ జి.పార్వతి పాల్గొన్నారు.

బలిజిపేట : తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు 461 మందికి నూతన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరుతున్నాయని తెలిపారు. తాను ఉన్నప్పుడే అందరికీ అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. దీంతో అక్కడికక్కడే ఎమ్మెల్యే సమక్షంలో లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రవికుమార్, సీనియర్ నాయకులు, ఎంపిడిఒ త్రినాథరావు, తహశీల్దార్ వివిఎస్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట.. పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి



పింఛన్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సీతంపేట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద కొత్తగా మంజూరైన 278 పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వి.కళావతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్లు అందుకోవడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే గ్రామ, వార్డు సచివాలయాన్ని సంప్రదించాలన్నారు. వారే దగ్గర ఉండి పింఛను అందేలా సాయం చేస్తారని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డక ఆదినారాయణ, ఎంపిడిఒ కె.గీతాంజలి, ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్‌రావు, సవర. రాము, మండల కోఆప్షన్ సభ్యులు, జిల్లా కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు కళావతి, జీలకర్ర సుందరమ్మ, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భామిని : మండలానికి కొత్తగా మంజూరైన 174 పింఛన్లను ఎమ్మెల్యే వి.కళావతి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి చిన్నమ్మి, సీనియర్ నాయకులు కొవ్వాడ చిరంజీవులు, సర్పంచులు మజ్జి మోహన్ బాబు, టింగ అన్నాజీరావు, తొగరాన శ్రీను, కొండగొర్రి చంటి పాల్గొన్నారు.

ర్యాలీల నిషేధం జిఒపై నిరసన

ప్రజాశక్తి-సీతానగరం

జిఒ కాపీలను దగ్ధం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి, వేణు, నాయకులు

ర్యాలీలు, రోడ్‌షోలపై ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 1ను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట బుధవారం జిఒ కాపీని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని, ప్రజలు బుద్ధి చెప్పే కాలం దగ్గర పడిందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు నిరసన తెలిపే హక్కును కాలరాయడం ఎక్కడా లేదన్నారు. రాజ్యాంగంలో హక్కును హరించడానికి చూడడం ప్రభుత్వ నియంత్రత్వ పోకడకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ దుర్మార్గపు చర్యను ప్రజాతంత్ర, అభ్యుదయ వాదులు, కార్మికులు ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు, మండల కమిటీ కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, బి.అప్పారావు, బి.నారాయణస్వామి, వై.రామారావు పాల్గొన్నారు.

బిఎల్‌ఒల పనితీరుపై అసంతృప్తి

సక్రమంగా పనిచేయకుంటే క్రమశిక్షణ చర్యలు : ఓటరు జాబితా పరిశీలకులు ఎ.బాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో బిఎల్‌ఒల పనితీరు సంతృప్తికరంగా లేదని ఓటరు జాబితా పరిశీలకులు ఎ.బాబు పేర్కొన్నారు. సక్రమంగా పని చేయని బిఎల్‌ఒలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా పరిశీలకులు జిల్లాలో బుధవారం పర్యటించారు. కలెక్టరేట్‌లో ఓటరు నమోదు అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులతో ఓటరు జాబితాపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో బిఎల్‌ఒల పాత్ర కీలకమన్నారు. చేర్పులు, మార్పులు, తొలగింపుల అంశంలో బిఎల్‌ఒల పరిశీలన పక్కాగా ఉండాలని ఆయన స్పష్టంచేశారు. పాలకొండ నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం 47, కురుపాం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం 24, పార్వతీపురం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం 10, సాలూరు నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం 27 బిఎల్‌ఒల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 18 - 19 ఏళ్ల వయస్సు గల యువతను ఓటరుగా నమోదులో పనితీరు కొంతమేర సంతృప్తికరంగా ఉందన్నారు. శాసన మండలి ఎన్నికల ఓటరు జాబితా తయారీలో అనర్హులు దరఖాస్తు చేస్తే ఉంటే వాటిని పరిశీలించిన, నిర్లక్ష్యంగా ఉన్న అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల సంఘం స్పష్టమైన నిబంధనలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన చర్యలను వివరించారు. ఫారం 6 - 12,929, ఫారం 8 - 792 దరఖాస్తులు అక్టోబరు నుండి అందాయని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకులు ఎ.బాబు

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, ఓటరు నమోదు అధికారులు బి.నవ్య, నూరుల్ కమర్, కె.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు రాష్ట్ర కమిటీలో నలుగురికి చోటు

ప్రజాశక్తి-పార్వతీపురం

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగన సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులుగా పార్వతీపురం మన్యం జిల్లా నుంచి నలుగురికి చోటు దక్కింది. జిల్లా అధ్యక్షులు ఎ.రమణారావు, ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ఉపాధ్యక్షులు వి.ఇందిర, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎస్.మాలతి ఎన్నికయ్యారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఫిబ్రవరి 11న జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు తెలిపారు. కోర్టుల్లో పెండింగులో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల కక్షిదారులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేసుల పరిష్కారానికి రాజీ మార్గమే ఉత్తమమని పేర్కొన్నారు.

కళాశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఎంఆర్ కళాశాల వద్ద విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫీజుల పెంపు తదితర సమస్యలపై ప్రశ్నించిన విద్యార్థుల పట్ల బెదిరింపులకు పాల్పడుతూ, వారికి యాజమాన్యం నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఎంఆర్ డిగ్రీ కళాశాలలో ఫీజుల సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, వీటి పరిష్కారానికి కాలేజి ప్రిన్సిపల్‌ను ప్రశ్నించిన విద్యార్థులకు సోకాజు నోటీసులు ఇవ్వడం,విద్యార్థులకు పరీక్షల సమయంలో హాల్ టిక్కెట్లు ఆపేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. వెంటనే మాన్సాస్ యాజమాన్యం ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాదివేన తల్లి అకౌంట్‌లో పడితేనే కళాశాల ఫీజు కట్టాలని రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్సా సత్యన్నారాయణ తెలిపారని అన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ ఐ అధ్యక్ష, కార్యదర్శులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము, సహాయకార్యదర్శి ఎం.హర్ష, నాయకులు రాజు, రమేష్, వెంకటేష్, సోమేష్, మణికిరణ్, డివైఎఫ్ఐ నాయకులు సతీష్ పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా ఆలోచించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్

విద్యార్థులు లక్ష్యం దిశగా ఆలోచన చేయాలని జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు, డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజీ పిలుపునిచ్చారు. ఈ మేరకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం పార్వతీపురంలోని వేదశ్రీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజీ మాట్లాడుతూ చదువుకు పేదరికం సమస్య కాకూడదని చెప్పారు. చదువు కోసం అంబేద్కర్ లాంటి మేధావులు ఎన్నో అవమానాలు, సమస్యలు అధిగమించి లక్ష్యాన్ని చేరుకున్నారని గుర్తుచేశారు. ఆ విధంగా విద్యార్థులు ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఆర్.రత్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలో భవిష్యత్తును నాశనం చేసే అనేక పరిస్థితులు ఎదురౌతాయని, వాటిని నియంత్రించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కార్యనిర్వాహక కార్యదర్శి పి.రంజిత్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ టీ.వినయ్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహన్

వ్యాక్సినేషన్ పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని బూర్జ, లక్ష్మీపురం, పెదబోగిలి, జోగింపేట గ్రామాల్లో వైద్య సిబ్బంది చేపట్టిన వ్యాక్సినేషన్ ప్రక్రియను బుధవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహన్ పరిశీలించారు. తొమ్మిది నెలలు నిండిన పిల్లలకు ఈ ఎఫ్ఐపివి మూడో డోసు వేస్తున్నట్లు ఆయన చెప్పారు. మండలంలో 20 మందికి ఈ టీకా వేసినట్లు వివరించారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ వివరాల నివేదికను సంబంధిత పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, జోగింపేట సర్పంచ్ కె.సింహాచలం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నగేష్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైద్య సిబ్బంది

నగేష్‌కు సత్కారం

ప్రజాశక్తి - కురుపాం

మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నియోజకవర్గ నేత్ర వైద్య నిపుణులు నగేష్‌రెడ్డిని సిహెచ్‌సి సూపరింటెండెంట్ శోభారాణి ఆధ్వర్యాన బుధవారం సత్కరించారు. గిరిజన ప్రాంతంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన డాక్టర్ దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖలోని పౌర గ్రంథాలయంలో నగేష్‌రెడ్డికి ఎన్‌టిఆర్ స్మారక అవార్డును అందజేసింది. ఈ నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది ఆయన్ను సత్కరించారు. ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఆయనకు గతంలో ఎన్నోసార్లు ఉత్తమ నేత్ర వైద్య నిపుణులుగా అవార్డులు, సత్కారాలు దక్కాయి. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీధర్, సందీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-సీతానగరం

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సక్రమంగా మార్గంలో పయనిస్తే బంగారు భవిష్యత్తు లభిస్తుందన్నారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రేణుక, లెక్చరర్లు డి.రామకృష్ణ, టి.రవి, వినోద్, సత్యంనాయుడు పాల్గొన్నారు.

పేదలకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి-సాలూరు

సంక్రాంతి, క్రిస్మస్ పండుగల సందర్భంగా డిప్యూటీ సిఎం రాజన్నదొర సతీమణి పి.రోజమ్మ బుధవారం పట్టణంలోని పేదలకు, కుష్టు రోగులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. రాజన్నదొర నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని లెప్రసీకాలనీకి చెందిన సుమారు 35మందికి వస్త్రాలు పంపిణీ చేశారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర సతీమణి రోజమ్మ

సరైన ప్రణాళికతోనే పంచాయతీ అభివృద్ధి

కురుపాం.. సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ సుజాత

ప్రజాశక్తి - కురుపాం

సమస్యలను గుర్తించి గ్రామసభలో ప్రణాళికలు తయారు చేసి, వాటి ఆధారంగా పంచాయతీని అభివృద్ధి పరచడమే లక్ష్యమని మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత అన్నారు. బుధవారం మేజర్ పంచాయతీ సచివాలయం వద్ద ఇఒ కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధి చెందాలంటే వాలంటీర్లు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ముందస్తుగా గుర్తించాలని చెప్పారు. వాటిపై ప్రణాళిక తయారు చేసి, పనులు చేపడితే పంచాయతీ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. వాలంటీర్లంతా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందించడంలో జాప్యం చేయొద్దని చెప్పారు. అధికారులు నిర్దేశించిన పనులను సక్రమంగా, సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ షేక్‌ఆదిల్, ఎంపిటిసిలు వి.బంగారునాయుడు, జి.సంతోషిని, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రజల సహకారంతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని కేదారిపురం సర్పంచ్ తాడంగి తులసమ్మ అన్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై చర్చించి, చేపట్టే పనులపై తీర్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సురేష్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలి

మండలంలోని తాడికొండ పంచాయతీ కప్పకల్లులో బుధవారం గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మండంగి జగ్గారావు పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. కప్పకల్లు, శిఖర పాయి, అడ్డంగి జంగడి భద్ర, చాపరాయిజంగిడి భద్ర గ్రామస్తులు రోడ్లు కావాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం.. అభివృద్ధి పనులపై చర్చిస్తున్న పంచాయతీ కార్యదర్శి సురేష్

పాలకొండ రూరల్ : గ్రామ పంచాయతీల అభివృద్ధిపై దృష్టిపెట్టాలని ఎంపిడిఒ డొంక త్రినాథులు అన్నారు. బుధవారం గోపాలపురం గ్రామంలో సిపిడిపిపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రణాళిక రూపొందించుకుని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అనీల్, ఇఒపిఆర్‌డి సత్యం, సర్పంచ్‌లు సిరిపురపు జగదీశ్వరరావు ఉన్నారు.

చంద్రబాబు సభలతో వైసిపిలో వణుకు

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నిర్వహించిన సభలకు వస్తున్న జనాదరణ చూసి ఓర్వలేక రాష్ట్ర ప్రభుత్వం లేనిపోని ఆంక్షలను విధిస్తోందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి విమర్శించారు. బుధవారం తన నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో చంద్రబాబు నిర్వహించబోయే సభలపై ప్రభుత్వం ఆంక్షలు పెట్టడం అన్యాయమన్నారు. వైసిపి నాయకుల సభలకు, సమావేశాలకు ఒక నీతి, ప్రతిపక్ష పార్టీ సభలకు మరోనీతి తగదన్నారు. సమావేశంలో టిడిపి సర్పంచ్ ఆముదాల నళిని , ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

జిఒ 1ని రద్దు చేయాలి

గుమ్మలక్ష్మీపురం : రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలనే ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వం అర్ధరాత్రి జిఒ 1ని తీసుకువచ్చిందని టిడిపి సీనియర్ నాయకులు నందివాడ కృష్ణబాబు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాలన లోటుపాట్లను ఎత్తిచూపి ప్రశ్నించడం ద్వారా సరైన మార్గంలో నడిపించేలా ప్రతిపక్షాల పాత్ర ఉంటుందన్నారు. వైసిపి ప్రభుత్వం చేసే అవినీతి కార్యక్రమాలపై ప్రశ్నించకుండా ఉండేందుకు ప్రతిపక్షం గొంతు నొక్కడానికి జిఒ 1ని తీసుకువచ్చారని చెప్పారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు చేస్తున్న కార్యక్రమాలకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక భయంతోనే వైసిపి ప్రభుత్వం ఇటువంటి జిఒలు తీసుకురావడం సిగ్గుచేటన్నారు. వెంటనే జిఒ 1ని రద్దు చేయాలని డిమాండ్‌చేశారు.

సీతానగరం.. కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపడుతున్న టిడిపి నాయకులు

టిడిపి నిరసన

సీతానగరం : కుప్పంలో చంద్రబాబు పర్యటనలో పోలీసుల లాఠీఛార్జీపై బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి ఆధ్వర్యాన కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు మాట్లాడుతూ సిఎం జగన్ నియంతలా వ్యవరిహస్తున్నారని విమర్శించారు. ర్యాలీలు, రోడ్‌షోలను నిషేధించడం దుర్మార్గమన్నారు. తక్షణమే ఆ జిఒ రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గర్బాపు ఉదయభాను, సలహరి గోపాలరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, ఆర్.వేణుగోపాల్ నాయుడు, బి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, ఎం.సూర్యానారాయణ, ఎస్.శ్రీను, యోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బగ్గందొరవలసలో ఇదేం కర్మ

మండలంలోని బగ్గందొరవలసలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై విపరీతంగా భారాలు మోపిందన్నారు. దాడులు, దౌర్జన్యాలు, భూ అక్రమాలు పెరిగిపోయాయని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు జి.వెంకట నాయుడు, జి.ఉదయభాను, వైసిపి మండల అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, ఆర్.వేణుగోపాల్ నాయుడు, ఎస్.హరిగోపాలరావు, ఎస్.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వంట మనిషిని విధుల్లోకి తీసుకోవాలని నిరసన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని జోగంపేట వద్దనున్న అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న వంట మనిషి బి.శ్రీదేవిని వెంటనే పనిలోకి తీసుకోవాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం గురుకుల పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. 2015 నుంచి శ్రీదేవి గురుకులంలో వంట మనిషిగా పనిచేస్తున్నారని, ఆమెను అర్ధాంతరంగా తొలగించడం అన్యాయమని గ్రామస్తులు తెలిపారు. తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని నిడగల్లు హైస్కూల్లో డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ బుధవారం తనిఖీలు చేపట్టారు. పాఠశాల తరగతులు, పరిశుభ్రత, ప్రయోగశాల, రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతి గురించి ఆరాతీశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరడాన శివున్నాయుడు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

రహదారి భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్ఐ పాపయ్య, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎన్.రమేష్ అన్నారు రోడ్డు. బుధవారం పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నారాయణ స్కూల్‌లో రహదారి భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కిషోర్, సంపత్ పాల్గొన్నారు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

డిప్యూటీ సిఎం రాజన్నదొర

కరపత్రాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-పాచిపెంట

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని డిప్యూటీ సిఎం రాజన్నదొర తెలిపారు. మండలంలోని గురువునాయుడుపేట, గొలుగువలస గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఏదైనా సమస్య ఉంటే తమకు తెలియజేయాలని సూచించారు. వెంటనే అధికారుల దృష్టికి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిడి సూర్యనారాయణ

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి-సాలూరు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని గిరిజన సంక్షేమ శాఖ డిడి సూర్యనారాయణ కోరారు. బుధవారం ఆయన మండలంలోని కురుకుట్టి, మామిడిపల్లి, అంటివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. మూడు నెలల్లో పదోతరగతి పరీక్షలు రానున్నందున విద్యార్థులు ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదవాలని కోరారు. ఏవైనా సబ్జెక్టుల్లో సంశయాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఆయన వెంట అంటివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెచ్ ఎం మహేంద్రనాథ్, గిరిజన సంక్షేమ వసతిగృహ అధికారుల సంఘం నాయకులు ఎం.లచ్చయ్య పాల్గొన్నారు.

వసతిగృహ సందర్శన

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ బాలికల గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని పార్వతీపురం ఐటిడిఎ డిప్యూటీ డైరెక్టర్ బంకుర సూర్యనారాయణ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహంలో నిత్యావసర సరుకుల నిల్వలను తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న మెనూ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలో రూ.కోటీ 80 లక్షలు కాస్మోటిక్ ఛార్జీలు విద్యార్థులకు బకాయి ఉందన్నారు. త్వరలో కాస్మోటిక్ ఛార్జీలను నేరుగా విద్యార్థుల అకౌంట్లకు వేస్తామని తెలిపారు. చలికాలం దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు 10 వేల రగ్గులు, 9 వేల బ్లాంకెట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. నాడు-నేడు కార్యక్రమం రెండో విడత కింద 15 పాఠశాలకు అదనపు భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు వివరించారు.

ఆదివాసీలే తొలి పోరాటయోధులు

ఎఎన్‌యు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్ఎస్ వరహాలు దొర

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్ వారితో పోరాడింది ఆదివాసీలేనని, వారి జీవిత గాథలను ఈ తరం గిరిజన యువత తెలుసుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ఎస్ వరహాలు దొర అన్నారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ఆదివాసీల పాత్ర అనే అంశంపై గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆదివాసీల చరిత్ర నేటికీ బాహ్య ప్రపంచానికి తెలియకపోవడం, వీరగాథలు ఏ చరిత్ర పుటల్లో లిఖించకపోగా కనీసం గుర్తింపునకు నోచుకోకపోవడం విచారకరమన్నారు. ఆదివాసీ జాతి ఆణిముత్యాలు ఉనికి చాటి చెప్పాలనే ఉద్దేశంతో ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీతంపేట, అరకు, పాడేరు, రంపచోడవరం, శ్రీశైలం ప్రాంతాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వాలు ఆదివాసీ పోరాటయోధుల జీవిత చరిత్ర పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని ఆయన కోరారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు, కళలకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలన్నారు. కొంతమంది యువత చదువుకునే వయసులో సెల్ ఫోన్లు, దురలవాట్లపై దృష్టి మళ్లిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. అనంతరం విద్యార్థులు గిరిజన సంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బా లోవరాజు, జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ, ట్రైబల్ పొలిటికల్ రైట్స్ జిల్లా అధ్యక్షులు టి.లోకనాథం, ట్రైబల్ ఎంప్లాయిస్ రైట్స్ అధ్యక్షులు బి.దామోదర్, ఆదివాసీ నాయకులు హరి బుజ్జి, రవికుమార్, సుదాకర్, కళావతి, కృష్ణబాబు, వనవాసి కళ్యాణ ఆశ్రమం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి జి.గవరన్న దొర తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఎన్‌యు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.ఎస్ వరహాలు దొర

ఉపాధి సిబ్బందితో సమీక్ష

మాట్లాడుతున్న పీడీ రామచంద్రరావు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక వైకెపి కార్యాలయం వద్ద కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యంవలస మండలాల ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం పీడీ కె.రామచంద్రరావు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి మండలంలో ఈ నెల పదో తేదీలోగా 5 వేల నుండి 7 వేల మంది కూలీలకు పని కల్పించేలా కృషి చేయాలన్నారు. ప్రతి ఉపాధి హామీ లబ్ధిదారుడు అకౌంట్‌కు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయించాలని తెలిపారు. ఉపాధి హామీ పనిప్రాంతాల నుంచి వేతనదారుల హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు. ఇవన్నీ చేయడానికి క్షేత్రస్థాయిలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా కీలక బాధ్యతలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎపిడి చంద్రమ్మ, ఎపిఒలు పి.బావాజీ, డి.శివరామకృష్ణ, ఆర్.సురేష్ నాయుడు, ఇసిలు డిఎస్ఆర్‌వి మూర్తి, మనోజ్, తేజ , తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో గురుకుల విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-వంగర

మండలంలో శ్రీహరిపురానికి చెందిన మజ్జి రితిక (14) డెంగీతో మృతి చెందింది. నిరుపేదలైన మజ్జితవుడు, నవితకు రితిక, జోసఫ్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. రిషిత మండలంలోని మడ్డువలస అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కుమారుడు జోసఫ్ సంతకవిటి మండలంలోని గుల్ల సీతారాంపురంలో ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ 7వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల డెంగీ జ్వరం బారిన పడడంతో పాఠశాల సిబ్బంది వంగరలోని పిహెచ్‌సికి తీసుకువెళ్లారు. తర్వాత తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు రాజాంలో గల కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి విశాఖలో గల కెజిహెచ్‌కు తరలించడంతో అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి డెంగీ జ్వరంగా నిర్ధారించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

అంధుల గుండెల్లో నిలిచిపోయిన బ్రెయిలీ

మక్కువ : అంధుల విద్యాభివృద్ధి కోసం లూయిస్ బ్రెయిలీ.. లిపి రూపొందించి, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వక్తలు కొనియాడారు బుధవారం మండలంలోని వెంకటభైరిపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పార్వతీపురం రూరల్ : భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఎంఇఒ పివి ప్రసాద్ , జిల్లా సహిత విద్యా సమన్వయకర్త భానుమూర్తి ఆధ్వర్యంలో బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆర్‌పిలు తిరుమల దేవి, రమణమూర్తి పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ చైర్మన్ మృతి తీరనిలోటు

ప్రజాశక్తి-రామభద్రపురం



విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు హఠాన్మరణం మూడు జిల్లాల పాడి రైతులకు తీరని లోటని స్థానిక డైయిరీ డైరెక్టర్ శంబంగి అమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. తులసీరావు మరణ వార్త బుధవారం సాయింత్రం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి చెందామని డెయిరీ మేనేజర్ రామచంద్రరావు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా అమ్మలు మాట్లాడుతూ నిరంతరం పాడి రైతుల శ్రేయస్సే కర్తవ్యంగా భావించి పాల విప్లవం తీసుకు వచ్చి ఆంధ్రా కురియన్ గా ప్రసిద్ధి గాంచారనీ కొనియాడారు. రైతులకు అన్ని సదుపాయాలు కలుగ జేసేందుకు ఎక్కడా లేని విధంగా డెయిరీ ఉద్యోగాలన్నీ పాడి రైతుల పిల్లల తోనే భర్తీ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రైతు శ్రేయస్సుకు పెద్ద పీట వేస్తూ రైతుల ఆరోగ్య సమస్యలు తీర్చేందుకు కృషి ఆసుపత్రిని నెలకొల్పి అత్యాధునిక వైద్య సదుపాయాలు అందజేస్తూ అంచెలంచెలుగా విస్తరిస్తూ నేడు ఐకాన్ ఆసుపత్రిగా అభివృద్ధి చేసిన ఘనత తులసీరావుకే దక్కుతుందన్నారు. విద్యార్థుల చదువులకు విద్యాలయాల సదుపాయంతో పాటు, అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు అందజేస్తూ వివిధ పోటీ పరీక్షల కోసం ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి వేల మంది విద్యార్థుల చదువులకు పరోక్ష సహాయం చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా తులసీరావు మృతికి సంతాపం ప్రకటించి స్థానిక యూనిట్ మేనేజర్ రామచంద్రరావు ఆధ్వర్యంలో మౌనం పాటించారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో మండ గ్రామానికి చెందిన సవర భాస్కరరావును అరెస్టు చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నీలకంఠారావు తెలిపారు. ఆయన్ను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.